స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీమ్ సభ్యులతో సీపీ సీవీ ఆనంద్

గోషామహల్ స్టేడియంలోకి గుర్రపుశాల

ఉస్మానియా నిర్మాణం కోసం పోలీసు విభాగాల తరలింపు

పనులను పరిశీలించిన సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, జూన్ 3(నమస్తే తెలంగాణ): గోషామహల్ పోలీస్ స్టేడియం ప్రాంగణంలో ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణం చేపట్టనున్నందున అక్కడ ఉన్న పోలీస్ శాఖకు చెందిన అన్ని బ్లాకులను తరలించామని, హార్స్‌గ్రౌండ్, గుర్రపుశాలను తాత్కాలికంగా స్టేడియంలోని ఖాళీ స్థలంలోకి తరలించామని సిటీ పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్ తెలిపారు. మంగళవారం గోషామహల్ స్టేడియంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. తమ శాఖకు చెందిన అన్ని విభాగాలను తరలించి వైద్యశాఖకు అప్పగించనున్నామని, ప్రభుత్వం హైదరాబాద్ సిటీ పోలీస్‌కు గోషామహల్‌లోనే 11.5 ఎకరాలు కేటాయించిందని తెలిపారు. ఈ స్థలంలో రెండు ఐదంతస్తుల భవనాలను నిర్మిస్తామని, అందులో ఒకటి సిటీ సెక్యూరిటీ వింగ్ కోసం, మరొకటి నగరంలో ఏడు జోన్లలో సీజ్ చేసిన పలు వాహనాలను నిలిపి ఉంచడానికి అనువుగా ఉండేలా తయారు చేయబోతున్నామని, ఇదే చోట గుర్రపుశాలను, హార్స్ గ్రౌండ్‌ను తయారు చేస్తున్నామన్నారు.

స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీమ్ ఏర్పాటు

హైదరాబాద్ నగరంలో ధర్నాలు, ర్యాలీలు, నిరసనదీక్షలు వంటివి ఎల్లప్పుడూ జరుగుతూ ఉంటాయని, ఆ సమయంలో మహిళలను అరెస్ట్ చేయాల్సి వస్తే చాలా ఇబ్బందికరంగా ఉండేదని సీవీ ఆనంద్ తెలిపారు. ఈ సమస్యను అధిగమించడానికి హైదరాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో కొత్తగా ఎంపికైన 35 మంది మహిళా కానిస్టేబుళ్లతో ఒక టీమ్‌ను స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీమ్‌గా ఏర్పాటు చేశామన్నారు. వీరికి గత కొన్ని రోజులుగా కరాటేలో శిక్షణ ఇవ్వడంతోపాటు ధర్నాల సమయాల్లో మహిళలను ఏ విధంగా అదుపులోకి తీసుకుని సురక్షితంగా తరలించాలనే దానిపై ప్రత్యేకమైన శిక్షణ ఇచ్చామని కమిషనర్ వివరించారు. త్వరలో ఇంకా కొంత మందిని చేర్చుకుని మొత్తం 42 మందితో రెండు ప్లాటూన్‌లుగా విభజిస్తామని సీపీ తెలిపారు. కార్యక్రమానికి సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ రక్షితకృష్ణమూర్తి, అడిషనల్ డీసీపీలు డి.కృష్ణయ్య, ఎన్.భాస్కర్, ఇక్బాల్ సిద్ధిఖి ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రామ్‌గోపాల్ పేట పీఎస్‌కు మరమ్మతులు

పనులు పరిశీలించిన సీపీ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, జూన్ 3(నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్‌లోని జేమ్స్ స్ట్రీట్‌లో రామ్‌గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ భవనాన్ని మంగళవారం నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్ సందర్శించి మరమ్మతు పనులను పర్యవేక్షించారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ భవనానికి మరమ్మతులు నిర్వహించి హైదరాబాద్ సిటీపోలీసులకు తిరిగి అప్పగిస్తున్నారని ఆనంద్ తెలిపారు. జేమ్స్ స్ట్రీట్ పీఎస్ భవనం 1900 సంవత్సరంలో నిర్మించారని, 116 సంవత్సరాల పాటు రామ్‌గోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌గా సేవలందించిందని, తాను డీసీపీ సెంట్రల్ జోన్‌గా ఉన్నప్పుడు ఈ భవనం నుంచే ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని అప్పటి సంగతులు గుర్తు చేసుకున్నారు. రానున్న కొద్దిరోజుల్లో రామ్‌గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన వస్తువులను తిరిగి ఈ భవనంలోకి తరలించి త్వరలోనే ప్రారంభోత్సవం చేయిస్తామని చెప్పారు. అంతేకాకుండా పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగిందని, వాటి పార్కింగ్ సదుపాయం కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ సిటీపోలీస్‌కు సంబంధించిన పురానాహవేలిలోని కమిషనర్ కార్యాలయానికి మరమ్మతులు చేయిస్తున్నామని, అది కూడా త్వరలో ప్రారంభించిన తర్వాత ప్రతి శుక్రవారం తాను అక్కడి నుంచే విధులు నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ డీసీపీ ఎస్.రశ్మిపెరుమాల్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్‌హెగ్డే తదితరులు పాల్గొన్నారు.

రామ్‌గోపాల్‌పేట పీఎస్‌లో మరమ్మతు పనులను పరిశీలించిన కమిషనర్ సీవీ ఆనంద్

కూకట్‌పల్లిలో కోటి విలువైన డ్రగ్స్ పట్టివేత

- డ్రగ్స్ దందాలో ఏపీ ఏఆర్ కానిస్టేబుల్
- ఐదుగురు అరెస్టు.. పరారీలో ఇద్దరు నిందితులు
- వివరాలు వెల్లడించిన బాలానగర్ జోన్ ఇన్‌చార్జి డీసీపీ కోటిరెడ్డి

విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న బాలానగర్ జోన్ ఇన్‌చార్జి డీసీపీ కోటిరెడ్డి

జీడిమెట్ల, జూన్ 3 : తిరుపతి నుంచి హైదరాబాద్ కొకైన్, ఇపిడ్రైన్ మత్తు పదార్థాన్ని తీసుకువచ్చి అమ్మేందుకు ప్రయత్నించిన ఐదుగురిని బాలానగర్ ఎస్ఓటీ , కూకట్‌పల్లి పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఆంధ్రప్రదేశ్ టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ప్రధాన నిందితుడు గుణశేఖర్ పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుంచి పోలీసులు కోటి రూపాయల విలువజేసే 820 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం షాపూర్నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో ఇన్‌చార్జి డీసీపీ ఎన్.కోటిరెడ్డి, ఎస్ఓటీ డీసీపీ డి.శ్రీనివాస్, బాలానగర్ జోన్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఎస్ఓటీ అడిషనల్ డీసీపీ విశ్వప్రసాద్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... తిరుపతికి చెందిన గుణశేఖర్ ఏపీలో టాస్క్ ఫోర్స్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గుణ శేఖర్ తిరుపతికి చెందిన అతడి స్నేహితుడు ఉన్నం సురేంద్ర(31)కు అత్యాశ చూసి మే 29వ తేదీన 820 గ్రాముల కొకైన్ (మత్తు పదార్థాన్ని) ఇచ్చి హైదరాబాద్ లో అమ్మాలని అప్పగించాడు. ఆశాపరుడైన సురేంద్ర గుణశేఖర్ చెప్పినట్లుగానే కొకైన్ తీసుకుని గుంటూరు గుండా హైదరాబాద్ కూకట్‌పల్లి చేరుకున్నాడు. హైదరాబాద్‌లో సురేంద్ర తన మనుషులైన బాపట్ల జిల్లాకు చెందిన దోతిరెడ్డి హరి బాబురెడ్డి(38), దేవరాజు యేసుబాబు(29)లను హైదరాబాద్ రప్పించుకున్నాడు. అదే విధంగా సురేంద్రచేగూడి మెర్సి మార్గరెట్(34), షేక్ మస్తాన్ వలీ(40)లను సైతం పిలిపించుకున్నాడు. అందరూ కలిసి కూకట్‌పల్లిలోని జయనగర్‌లో కలుసుకున్నారు.

జూన్ 2వ తేదీ అమ్మేందుకు పథకం..

వీరంతా కలిసి జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు పోలీసులు బీజీగా ఉంటారని, ఆ రోజే అమ్మేందుకు పథకం వేశారు. వారు అనుకున్నట్లుగా కొకైన్ డిమాండ్ ఉన్న చోట యేసుబాబు ద్వారా అమ్మాలని భావించారు. వీరంతా కలిసి జూన్ 2వ తేదీన కూకట్‌పల్లి భాగ్యనగర్ వైపు వెళ్తుండగా.. అనుమానం వచ్చిన పోలీసులు వారిని ఆపి తనిఖీ చేయగా.. వారి వద్ద కొకైన్ లభించింది. వెంటనే ఐదుగురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అసలు కొకైన్ వీరికి ఎక్కడి నుంచి వచ్చిందనే విషయం ప్రధాన నిందితుడు గుణశేఖర్ పోలీసులకు పట్టుబడితే అసలు విషయాలు బయటకు వస్తాయని పోలీసులు తెలిపారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ రవికుమార్, కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ రాజేష్, బాలానగర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్, ఎస్సైలు కట్కం గౌతం ఉన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండేలా చూడండి

తమ పిల్లలు బయట ఎలాంటి యాక్టివిటీస్ చేస్తున్నారో పిల్లల తల్లిదండ్రులు గమనించాలని డీసీపీ కోటి రెడ్డి తెలిపారు. అదే విధంగా పిల్లలపైన అనుమానం వస్తే వారి కదలికలను గమనించి పోలీసులకు తెలిపాలని కోరారు. మీ ప్రాంతాల్లో యువత ఏదైనా డ్రగ్స్, గంజాయి లాంటివి సేవిస్తున్నారని తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

పెట్టుబడుల పేరుతో రూ.24.36 కోట్ల మోసం

కేసు నమోదు.. నిందితుల అరెస్ట్

సిటీబ్యూరో, జూన్ 3(నమస్తే తెలంగాణ): సామాన్య ప్రజల నుంచి వ్యాపారంలో పెట్టుబడులు పెడ్తామంటూ పెద్దఎత్తున డబ్బులు తీసుకుని ఆ తర్వాత మోసం చేసిన కేసులో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు ఇద్దరిని మలక్‌పేటలో అరెస్ట్ చేశారు. అర్బన్ మార్కెట్ అండ్ అదర్స్ పేరిట ఆన్‌లైన్ గ్రాసరీ యాప్ పేరుతో బాధితుల నుంచి రూ.24.36 కోట్లు తీసుకుని మోసం చేసిన కేసులో రాజస్థాన్‌కు చెందిన ముఖేష్ చౌదరి, మహారాష్ట్రకు చెందిన అమిత్‌కుమార్ పిలానియాలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో అమిత్‌కుమార్ పిలానియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన సీసీఎస్ పోలీసులు ఆ తర్వాత ఫిర్యాదుదారు, నిందితుడితోపాటు బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఆ తర్వాత సీఏతో చర్చించి ఫిర్యాదుదారుడైన అమిత్‌కుమార్ కూడా నిందితుడేనని నిర్ధారించి అతడిని అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు.

ఫోర్జరీ సంతకాలతో మార్టిగేజ్ డీడ్ రిలీజ్

ఆరుగురి అరెస్ట్

బండ్లగూడ, జూన్ 3: ఫోర్జరీ సంతకాలతో అపార్ట్మెంట్‌కు సంబంధించిన మార్టిగేజ్‌ను రిలీజ్ చేసిన ఘనులతోపాటు భూ యజమానిని రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి పిస్తా హౌస్ వద్ద ఉన్న ఆస్కాన్ రెసిడెన్సీలో 20 ఫ్లాట్లు ఉన్నాయి. జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం రెండు ఫ్లాట్లు చార్మినార్ జీహెచ్ఎంసీకి మార్టిగేజ్ చేశారు. కాగా, అపార్ట్మెంట్‌లో పనులు పూర్తి చేయకుండానే యజమాని కాజా అజముద్దీన్ డాక్యుమెంట్ రైటర్ సత్యనారాయణతో కలిసి తప్పుడు పత్రాలను సృష్టించి ఫోర్జరీ సంతకాలతో గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో మార్టిగేజ్ డీడ్‌ను రిలీజ్ చేశారు. విషయం తెలుసుకున్న బిల్డర్ మహమ్మద్ షా ఫహద్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులను సంప్రదించి వివరాలు తెలిపారు. దీంతో చార్మినార్ జోన్ టౌన్‌ప్లానింగ్ అధికారి ఎంఏ మజీద్ గత సంవత్సరం డిసెంబర్ 6వ తేదీన రాజేంద్రనగర్ పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి సత్యనారాయణ, కాజా అజముద్దీన్, శ్రీనివాస్, వీరబాబు, ప్రకాశ్, ఫరూక్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరు నకిలీ పోలీసుల అరెస్ట్

సిటీబ్యూరో, జూన్ 3(నమస్తే తెలంగాణ): నగరంలో స్పా సెంటర్లను పోలీసులమని చెప్పి టార్గెట్ చేసి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు నకిలీ పోలీసులను హైదరాబాద్ వెస్ట్‌జోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. శాలిబండకు చెందిన రౌడీషీటర్ సయ్యద్ అహ్మద్ హష్మి అలియాస్ మిర్చి అహ్మద్, మహ్మద్ ఫయాజ్ అలియాస్ షరీఫ్‌లు తమ అనుచరులతో కలిసి సిటీలో ఉన్న స్పా సెంటర్లపై దాడులు చేసి, తాము సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, ఎస్ఓటీ పోలీసులమని చెప్పి స్పా సెంటర్ల సిబ్బందిని డబ్బులు డిమాండ్ చేసేవారని పోలీసులు తెలిపారు. ఫిల్మ్‌నగర్, పంజాగుట్ట, మాసబ్‌ట్యాంక్, మాదాపూర్‌లలో ఉన్న స్పా సెంటర్లలో రూ.50వేల నుంచి రూ.60వేలు వసూలు చేసేవారని తెలిపారు. ఇదే క్రమంలో ఒక స్పా సెంటర్‌లో డబ్బులు డిమాండ్ చేస్తున్న సమయంలో ఈ ఇద్దరు సూడో పోలీసులను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్, మాసబ్‌ట్యాంక్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.20వేల నగదు, ఒక స్పై కెమెరా, వన్‌ప్లస్ మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులు వెస్ట్‌జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.యాదేందర్, ఎస్ఐ జాహెద్ తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

డ్రగ్స్ కేసును సీబీఐతో విచారించాలి

సిటీబ్యూరో : కూకట్‌పల్లి డ్రగ్స్ కేసులో తిరుపతికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ పట్టుబడటంపై తిరుపతి ఎంపీ గురుమూర్తి స్పందించారు. కేసును సీబీఐతో విచారించాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. తెలంగాణ డ్రగ్స్ కేసులో ఏపీకి చెందిన పోలీసులు భాగస్వాములవ్వడం కలచి వేసిందన్నారు. ఏపీలో డ్రగ్స్ దందాను అరికట్టడంలో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఏకంగా ఏపీకి చెందిన పోలీసులే డ్రగ్స్ దందా చేస్తుండటం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. కేసును సీబీఐకి అప్పగించి సమర్థులైన అధికారులతో దర్యాప్తు చేపట్టాలని కోరారు. పట్టుబడిన కానిస్టేబుల్‌పై తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మున్సిపాలిటీల్లో నేటి నుంచి వార్డుల విభజన

(మొదటిపేజీ తరువాయి)

కసరత్తు చేశారు. మున్సిపాలిటీల్లో ఏర్పడిన గ్రామాల్లో ఓటర్ల జాబితా ఆధారంగా వార్డులను విభజించనున్నారు. ఎల్లంపేట మున్సిపాలిటీలో 14గ్రామాలు అలియాబాద్‌లో 6, మూడుచింతపల్లిలో 14 గ్రామాలను విలీనం చేసి మున్సిపాలిటీలుగా చేసిన విషయం విదితమే. గతంలో నిజాంపేట్, జవహర్‌నగర్, పీర్జాదిగూడ, బొడుప్పల్ నాలుగు కార్పొరేషన్లు ఉండగా మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూకుంట, నాగారం, దమ్మాయిగూడ ఘట్‌కేసర్, కొంపల్లి, దుండిగల్, పోచారం మున్సిపాలిటీలు ఉండగా ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి నూతన మున్సిపాలిటీలుగా ఏర్పడటంతో 16 మున్సిపాలిటీలతో మేడ్చల్-మల్కాజిగిరి అర్బన్ జిల్లాగా మారినట్లయింది.

రంగారెడ్డిలో 5 మున్సిపాలిటీల్లో...

రంగారెడ్డి జిల్లా పరిధిలోని పెద్దఅంబర్‌పేట్, తుక్కుగూడ, శంషాబాద్ మున్సిపాలిటీలతోపాటు కొత్తగా ఏర్పాటైన చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీల్లో వార్డుల విభజన జరుపనున్నారు. ప్రస్తుతం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో 24 వార్డులుండగా...అదనంగా మరో ఐదు గ్రామాలు కలిశాయి. దీంతో వార్డుల విభజన తప్పనిసరి అయ్యింది. అలాగే, తుక్కుగూడలో ప్రస్తుతం 16వార్డులున్నాయి. ఈ మున్సిపాలిటీల్లోనూ కొత్తగా మరో మూడు గ్రామాలను విలీనం చేశారు. ఇక్కడ కూడా వార్డుల విభజన చేయనున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీలో ప్రస్తుతం 25వార్డులు ఉండగా. కొత్తగా మరో 7గ్రామాలు విలీనమయ్యాయి. ఈ మున్సిపాలిటీలోనూ వార్డుల విభజన చేస్తారు. జిల్లాలో కొత్తగా ఏర్పడిన చేవెళ్లలో ప్రస్తుతం 18 వార్డులున్నాయి. కొత్తగా మరో 12 గ్రామాలను విలీనం చేశారు. అలాగే, మొయినాబాద్ మున్సిపాలిటీలో 26వార్డులున్నాయి. కొత్తగా మరో 10 గ్రామాలను విలీనం చేశారు. దీంతో ఈ రెండు మండలాల్లో కూడా వార్డుల విభజన జరుగనుంది. వార్డుల విభజన అనంతరం ఈ రెండు మున్సిపాలిటీల్లో మరిన్ని వార్డులు పెరిగే అవకాశాలున్నాయి.

అన్నకు చెప్పకుండా రోడ్డు వేస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

అయితే ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సమాచారం లేకుండా పనులు ఎలా ప్రారంభిస్తారంటూ కొంతమంది అధికార పార్టీ నేతలు కొర్రీలు పెట్టారు. ఎమ్మెల్యే పనులు ఆపేయమన్నారంటూ అధికారులకు హుకుం జారీ చేశారు. రెండ్రోజులుగా పనులు నిలిచిపోయాయి. వర్షాలు వచ్చే లోగా రోడ్డుపనులు పూర్తవుతాయని ఆశలు పెట్టుకున్న స్థానికులు అధికారపార్టీ నేతల నిర్వాకంపై మండిపడుతున్నారు.

ఎమ్మెల్యేను నిలదీసిన కార్పొరేటర్..

రోడ్డు పనులను ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆపేయించారంటూ వార్తలు రావడంతో మంగళవారం కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ బస్తీలో పర్యటించారు. 'అభివృద్ధి పనుల కోసం నిధులు తేవడంలో నిర్లక్ష్యం చేస్తున్న మీరు జరుగుతున్న పనులు ఎలా ఆపుతారంటూ..' ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఫోన్ చేసిన కార్పొరేటర్ వెంకటేశ్ నిలదీశారు. తనకు సమాచారం లేదని, తాను ఈ వ్యవహారంపై సమగ్ర సమాచారం తీసుకుంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే పేరుతో కొంతమంది లీడర్లు ఇలాంటి పనులు చేస్తున్నారని. వారిపై చర్యలు తీసుకుని అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని కొర్పొరేటర్ కోరారు.

అక్రమమని తెలిసినా మౌనం

(మొదటిపేజీ తరువాయి)

చూపించారు. పనులు కూడా ప్రారంభం కావడంతో అడ్డదారిలో అనుమతులు పొందిన తీరును ఎండగడుతూ 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు ప్రచురించింది. స్పందించిన హౌసింగ్ బోర్డ్ అధికారులు రంగంలోకి దిగి భవనాల పత్రాలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలిస్తే జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అనుమతి పొందిన ఆ భారీ భవనాల నిర్మాణంతో పాటు మరో నాలుగు అపార్ట్‌మెంట్ల నిర్మాణాలకు కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో అనుమతులు జారీ చేసినట్లు తెలుసుకున్నారు. వెంటనే జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి.. తప్పుడు పత్రాలతో భవన నిర్మాణ అనుమతులు పొందారాని, వారు చూపించిన దారి హౌసింగ్ బోర్డ్‌కు చెందిన స్థలం అని పూర్తి ఆధారాలతో పత్రాలను సమర్పించి... చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ విషయం ముఖ్యమంత్రి కార్యాలయం వరకు చేరడంతో ఉక్కిరిబిక్కిరైన జీహెచ్ఎంసీ, హౌసింగ్ బోర్డ్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. తప్పుడు పత్రాలతో అనుమతులు పొందిన భవనాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి చేతులు దులుపుతున్నారు.

అధికారులకు భారీగా ముడుపులు..!

హౌసింగ్ బోర్డ్ స్థలాన్ని దారిగా చూపించి.. కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో అనుమతులు పొందిన కొందరు వ్యక్తులు కోర్టును ఆశ్రయించి స్టేను తీసుకొచ్చారు. కానీ ప్రధాన కార్యాలయంలో అనుమతులు పొందిన కే పాండు అనే నిర్మాణదారుడు కోర్టును కూడా ఆశ్రయించలేదు. జీహెచ్ఎంసీ జారీచేసిన నోటీసులకు భయపడకుండా నిర్మాణ పనులను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. పోలీసు విభాగంలో ఉన్నతాధికారి పేరు, ఏపీలోని అధికార పార్టీకి చెందిన మంత్రుల పేర్లు, రాష్ట్రంలోని అధికార పార్టీ నేతల పేర్లు.. స్థానికంగా ప్రజాప్రతినిధుల పేర్లు చెబుతూ... నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు. అనుమతులకు మించి ఒక ఫ్లోర్ ఎక్కువ కడితేనే హడావిడి చేసే అధికారులు తప్పుడు పత్రాలతో అనుమతులు పొందారని తెలిసిన ఆ భారీ భవన నిర్మాణాలకు చెందిన అనుమతులు రద్దు చేయడంలో మాత్రం వెనుకంజ వేస్తున్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన జీహెచ్ఎంసీ కమిషనర్ వద్దకు ఈ వ్యవహారాన్ని తీసుకెళ్లకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు.. జాగ్రత్త పడుతున్నట్టు తెలిసింది. అనుమతులు పొందినప్పటి నుంచి... తప్పుడు పత్రాలతో అనుమతులు పొందారని వచ్చిన ఫిర్యాదులను.. పక్కన పెట్టడంలో టౌన్ ప్లానింగ్ అధికారులకు భారీగా ముడుపులు ముట్టినట్లు .. అందుకే పట్టించుకోవడంలేదని కిందిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారులే చర్చించుకోవడం గమనార్హం. ఇంతటి వ్యవహారం బహిరంగంగానే జరుగుతున్న జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేయడంతో... ఈ భవనాల నిర్మాణం వెనుక పాత్రధారులు ఎవరు... సూత్రధారులు ఎవరు... అన్న అంశంపై జోరుగా చర్చ సాగుతుంది. సామాన్యులను నిబంధనల పేరుతో ఇబ్బందులు పెట్టే జీహెచ్ఎంసీ అధికారులు కళ్లముందే ఇంత వ్యవహారం నడుస్తున్న పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. దీనిపై కమిషనర్ వెంటనే జోక్యం చేసుకొని సదరు నిర్మాణ అనుమతిని రద్దు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠా సభ్యులు

నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు సరఫరా.. ముఠా రిమాండ్

శంషాబాద్ రూరల్, జూన్ 3 :నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు సరఫరా చేస్తున్న ఓ ముఠా సభ్యులను శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన మంగళవారం జరిగింది. శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ వివరాలను మీడియాకు వివరించారు. నల్లకొండ జిల్లాకు చెందిన గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి డిగ్రీ పూర్తి చేసిన్నట్లు సర్టిఫికెటు కావాలని 2021 ఆగస్టు నెలలో బీఎన్‌రెడ్డి నగర్ హస్తినాపురం గ్రామానికి చెందిన అశోక్ అనే వ్యక్తిని కలువగా.. రూ.80వేలు తీసుకొని కేరళ రాష్ట్రానికి చెందిన మరో వ్యక్తి సహకారంతో తమిళనాడు రాష్ట్రంలోని మధురై కామరాజ్ యూనివర్సిటీలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ 2015నుంచి 2018వరకు పూర్తి చేసినట్లుగా నకిలీ సర్టిఫికెట్ అందించాడు. నకిలీ సర్టిఫికెట్ ద్వారా యూఎస్ఏలోని వెబ్‌స్టార్ యూనివర్సిటీలో అడ్మిషన్ వచ్చింది. దీంతో 28-09-2023 తేదీన యూఎస్ఏకు వెళ్లి అక్కడ 15 నెలల పాటు చదువుకొని తిరిగి ఇండియాకు వచ్చాడు. తిరిగి చదువుకోవడం కోసం యూఎస్ఏకు వెళ్లగా అక్కడి ఎయిర్‌పోర్టు అధికారులు వెనక్కి పంపించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న అతడిపై అనుమానం వచ్చిన ఆర్‌జీఐఏ ఇమిగ్రేషన్ అధికారులు అతడి సర్టిఫికెట్లు పరిశీలించగా.. నకిలీవిగా గుర్తించారు. దీంతో నిందితుడిని శంషాబాద్ ఆర్‌జీఐఏ అవుట్‌పోస్టు పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు హస్తినాపురం గ్రామానికి చెందిన అశోక్ మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ శ్రీధన లక్ష్మీ ఓవర్‌సిస్ ప్రైవేటు లిమిటెడ్(స్టడీ అబ్రాడ్ కన్సల్టెన్సీ) నడిపిస్తున్న వ్యక్తి కేరళకు చెందిన మరో వ్యక్తితో కలిసి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి సర్టిఫికెట్ లక్ష రూపాయలకు అమ్ముతున్నట్లు గుర్తించారు. కేరళకు చెందని వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు వివరించారు. నిందితుల నుంచి రూ.10లక్షల నగదుతో పాటు సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, నకిలీ స్టాంపులు, బ్యాంకు ఖాతాలు మధురై యూనివర్సిటీకి చెందిన 13, ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన నలుగురు వ్యక్తులకు పేర్లు ఉన్న నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పెండ్లి చేసుకోవాలని వేధింపులు.. యువకుడిపై కేసు

బేగంపేట్ జూన్ 3: నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. నన్ను పెళ్లి చేసుకోవాలి లేదంటే చంపేస్తానని ఓ యువతిని బెదిరిస్తున్న ఓ వ్యక్తిపై బేగంపేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బేగంపేట్ శ్యాంలాల్ బిల్డింగ్ ప్రాంతంలో నివాసముంటున్న ఓ యువతి(28)కు 2021లో ఉమర్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. ఆ పరిచయం కాస్త ప్రేమకు దారి తీసింది. ఉమరు ఈ మధ్య ఆ యువతిపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో ఆ యువతి ఉమర్ను దూరం పెడుతూ వచ్చింది. ఆరు నెలలుగా ఉమర్ తనను పెళ్లి చేసుకోవాలని ఫోన్లు చేయడం, సందేశాలు పంపించడం చేస్తున్నాడు. పలు రకాలుగా వేధించడం చేస్తున్నాడు. గత నెల 30న రాత్రి 9 గంటల ప్రాంతంలో సదరు యువతి ఇంటికి వచ్చి తనను పెళ్లి చేసుకోవాలని లేదంటే చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు బేగంపేట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కారు దగ్ధం.. తృటిలో తప్పిన ప్రమాదం

పూర్తిగా కాలిపోయిన కారు

శేరిలింగంపల్లి, జూన్